క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నక్కపల్లి : స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లే శివయ్య తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కావాల్సిన వారు ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బీఏ హానర్స్, బీకాం హానర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ హానర్స్(బాటనీ), బీఎస్సీ(గణితం) బిఏ హానర్స్(హిస్టరీ)కోర్సుల్లో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అన్ని కోర్సులకు కంప్యూటర్ సైన్స్ కోర్సు మైనర్ సబ్జెక్ట్‌గా ఆఫర్ చేస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వ ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్ షిప్ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తరగతులు, కంప్యూటర్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలవారు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వెంకటాపురంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


మాట్లాడుతున్న వెంకటాపురం సర్పంచ్ తాతాజీ

మునగపాక : వెంకటాపురం గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని సర్పంచ్ సుందరపు తాతాజీ అన్నారు. వెంకటాపురం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మోహిని అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, పాలక వర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్స్ పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు, చిట్టిబాబు

పాయకరావుపేట : ఇందిరాకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాయకులు కిట్స్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


పింఛను పంపిణీ చేయిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: మండలంలో గల 24 గ్రామాల్లోను పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయినట్టు ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో గల 13,135 మంది పింఛన్లకు గాను 12,987 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ సిబ్బందితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

అనకాపల్లి: వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నందున అధికార యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కలెక్టర్ రవిపట్టన్ శెట్టికి మంగళవారం లేఖ రాశారు. గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల మండలాల్లో ఏజెన్సీని ఆనుకొని ఉన్న గ్రామాల్లో ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలను గుర్తించి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో మలేరియా పరీక్ష కిట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని, అధికారులు దానిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

చెరువులు కాదు రహదారులే...

- నేషనల్ హైవే అథారిటీ నిర్వాకం
- రోడ్లపైనే నిలిచిపోతున్న వర్షపునీరు
- సరైన డ్రైనేజీలు లేక ప్రయాణికులకు తిప్పలు


చినరామభద్రపురం వెళ్లే దారిలో చెరువును తలపిస్తున్న రోడ్డు


మోకాలి లోతు నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు



నిలిచిపోయిన నీటిని పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న గ్రామస్తులు

నక్కపల్లి : నేషనల్ హైవే వారి నిర్వాకం కారణంగా జాతీయ రహదారి నుంచి పలు గ్రామాలకు రాకపోకలు సాగించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే చాలు జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతోంది. మోకాలి లోతు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆయా గ్రామాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయరహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ సక్రమం లేకపోవడంతో ఈ ఇబ్బుఇదులు ఏర్పడుతున్నాయంటూ పలు గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా దేవవరం గ్రామంతోపాటు శివారు చినరామభద్రపురం గ్రామాలకు వెళ్లే రోడ్ల వద్ద ఈ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఇక్కడ వర్షపునీరు డ్రైనేజీల్లోకి వెళ్లేలా నేషనల్ హైవే అధికారులు మార్గాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షాలు పడిన సందర్భంలో వర్షపునీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. మోకాలిలోతు నీరు రోడ్డుపై ఉండి చెరువులను తలపిస్తోంది. బైక్‌లు, ఆటోల్లో వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట అయితే ఈ నీట్లోనుంచి రాకపోకలు సాగించడానికి భయాందోళనలకు గురవుతున్నామంటూ చినరామభద్రపురం గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాన్ని వారు స్థానిక నాయకులు దేవర సత్యనారాయణ, గొర్ల సర్సింహమూర్తి సాయంతో నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేశారు. శని ఆదివారాల్లో కురిసిన వర్షాలకు చినరామభద్రపురం వెళ్లు రోడ్డులో చెరువుగా తయారయిందని వారు తెలిపారు. తాత్కాలికంగా ఈ నీటిని తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ఇక్కడ వర్షపునీరు డ్రైనేజీల్లోకి వెళ్లే విధంగా కాలువలు నిర్మించడం, లేదా పైపులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి తమ గ్రామస్తులు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఉద్దండపురం, వేంపాడు, కాగిత గ్రామాల పరిధిలో కూడా ఇటువంటి సమస్యలు నెలకొన్నాయి. హైవే అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ప్రధాన గ్రామాలకు సమీపంలో హైవే అధికారులు నిర్మించిన డ్రైనేజీలపై సిమెంటు పలకలు పగిలిపోయాయని, రోడ్డు దాటే సమయంలోను, ఆదమరచి ఈ డ్రైనేజీలపై నడిచి వెళ్లే సమయంలో ప్రమాదాలబారిన పడుతున్నారని, ఈ కాలువలపై సిమెంట్ పలకలు వేయించాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

అతిసార నియంత్రణకు చర్యలు

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు


సీహెచ్‌ఎల్‌పురంలో కాలువల్లో పూడిక తీత పనులు


రమణయ్యపేటలో ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పనులు

నక్కపల్లి : గ్రామాల్లో ప్రబలుతున్న అతిసార(డయేరియా) విషజ్వరాలు అరికట్టేందుకు పంచాయతీలు దృష్టి సారించాయి. నాలుగు రోజుల నుంచి పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీత, వీధుల్లో చెత్త తొలగించడం, శుభ్రం చేయడం, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో బ్లీచింగ్‌తో క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చుక్కలవాని లక్ష్మీపురం, రమణయ్యపేట, నర్సాపురం, నక్కపల్లి తదితర గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది క్లోరినేషన్ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాలతోపాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో పాతనీటిని తొలగించి బ్లీచింగ్‌తో శుభ్రం చేయిస్తున్నారు. బావుల్లో కూడా బ్లీచింగ్ చల్లిస్తున్నారు. కాలువలు, వీధుల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపించే కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిల్వ ఉన్న నీటిని తాగడం వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు సూచనల మేరకు పంచాయతీ సిబ్బంది క్లోరినేషన్ కార్యక్రమాలపై దృష్టి సారించారు. ప్రతి గ్రామంలోను యుద్ధ ప్రాతిపదికన క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు. కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాల్లో అతిసార, విష జ్వరాలతో బాధపడే వారుంటే తక్షణమే ఏఎస్ఎంలను అప్రమత్తం చేసి వైద్య సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చామన్నారు.

ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య లోపంపై ఎమ్మెల్యే ఆగ్రహం


ప్రభుత్వాస్పత్రి పాత భవనం పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

యలమంచిలి రూరల్ : కంపు కొడుతూ చెత్త చెదారాలతో దయనీయంగా ఉన్న యలమంచిలి ప్రభుత్వాస్పత్రి పాత భవనం పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది,ఆస్పత్రి వైద్యులు, శానిటేషన్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో తన పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం యలమంచిలి సీహెచ్‌సీ కొత్త,పాత భవనాలను పరిశీలించిన ఆయన పాత భవనం ముఖద్వారం వద్ద తీవ్రమైన దుర్వాసన రావడం, కొన్ని గదుల్లో అసాంఘిక కార్యకలాపలు జరుగుతున్నట్టు పరిస్థితులు ఉండడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని పట్టణ ఎస్ఐ పాపినాయుడుకు చెప్పారు. అంతకుముందు ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రి నిర్వహిస్తున్న కొత్త భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజలకు కావాల్సిన వసతులను దశలవారీగా ఏర్పాటు చేస్తామన్నారు.

డ్వాక్రా మహిళలను మోసం చేసిన అధికారులను శిక్షించాలి


ధర్నా చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం, కొత్తూరు, మూలపేట పంచాయతీ పరిధిలో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద సీపీఎం, ఐద్వా ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు చేసి 6 నెలలైనా అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి మండలం పంచాయతీల పరిధిలో వీవోఏ గ్రూపు సభ్యులకు తెలియకుండా నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచ్‌ల్లో సుమారు రూ.8 కోట్లు అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు చేసిన స్కాంపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, బాధితులు జి.సుభాషిణి, నందిక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలి


కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావుకు వినతి పత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

కశింకోట: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు పారితోషికాన్ని అందించాలని సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి కోరారు. ఈ మేరకు ఆశ కార్యకర్తలతో కలిసి కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను వేర్వేరుగా కలిసి, మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఆశ కార్యకర్తలకు సబ్బవరం, తదితర ప్రాంతాల్లో రోజుకి రూ.200 వంతున పారితోషికం చెల్లించారని, అలాగే ఇక్కడ కూడా విధులు నిర్వర్తించిన ఆశా కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా సీతపాలెం

రాంబిల్లి : సీతపాలెం తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన సీతపాలెం తీరప్రాంతాన్ని పరిశీలించారు. పూడిమడక-కొత్తపట్నం రోడ్డు నుంచి సీతపాలెం తీరం వరకు 2.4కిలోమీటర్ల పొడవునా రోడ్డును రూ 1.6 కోట్లుతో నిర్మిస్తామన్నారు. ఈ పనులు త్వరితగతిన ప్రారంభం చేయాలని అధికారులను ఆదేశించారు. సీతపాలెం అందమైన తీరప్రాంతమని అభివృద్ధి చేస్తే పర్యాటలతో ఈ ప్రాంతం కళకళలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎన్ రాజు(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

వెదురుపర్తి హైస్కూల్లో గణిత క్లబ్ ప్రారంభం

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో శకుంతలాదేవి గణిత క్లబ్‌ను హెచ్‌ఎం జి.వి.కె. ఆచారి మంగళవారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షునిగా పాలా దుర్గా ప్రసాద్, కార్యదర్శిగా పావని పరమేశ్వరి, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. విశిష్ట సేవలందించిన పదిమంది గణిత శాస్త్ర వేత్తలను వినూత్నంగా ఆటల ద్వారా పరిచయం చేసిన విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

ఘనంగా పార్వతీదేవి, సాంబమూర్తుల కల్యాణం


నాగులాపల్లిలో పార్వతీదేవి, సాంబమూర్తుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం రాత్రి పార్వతీదేవి, సాంబమూర్తుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో సాంబమూర్తి, పార్వతీదేవిల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగా ఆలయ ప్రాంగణంలో అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది ఇచ్చే సలహాలను పాటించాలని గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్, కీర్తి తెలిపారు. డయేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గొలుగొండలో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సీజన్‌లో కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన, చికిత్స కోసం గ్రామాల్లో ఇప్పటికే పలు వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

మాడుగుల రూరల్: ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్‌పీఎస్ఎస్ ప్రసాదుపాత్రుడు తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కేజే పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో చింతాడ పుష్పమ్మకు మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాద్ మాట్లాడుతూ పుష్పమ్మ సేవల్ని కొనియాడారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులతో పాటు బుడబండి రాజు, విశ్రాంత డీపీఎం చిన తిరుపతి, ఆరోగ్య సహాయకుడు పేర్ని శంకర్ తదితర్లు ఆమె అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పమ్మ, ప్రసాద్ దంపతులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక పెద్దలు, పుష్పమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోత మొదలైంది..

- ఇది శ్యాంపిల్ మాత్రమే..
- మండలంలో 74 పింఛన్లకు కోత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ జ్యోతి

కోటవురట్ల : కొత్త ప్రభుత్వం రాగానే పింఛన్లలో కోత పడింది. వచ్చీ రాగానే టీడీపీ ప్రభుత్వ మార్కు కోత మొదలైంది. చంద్రబాబు అంటేనే లబ్ధిదారులు అర్హత నుంచి రాలిపోయేలా చేయడంలో ట్రెండ్ సెట్టర్. ఆయన అమలు చేసే హామీలకు ఎన్నో కండిషన్లు ఉంటాయి. వాటిలో ఎందరో రాలిపోతారు. క్రమేపీ టీడీపీ నాయకుల ఒత్తిడితో మరికొంత మందికి కోత పడుతుంది. ప్రస్తుతం మొదటగా పింఛన్ల పంపిణీ వచ్చింది కాబట్టి, ఇక్కడి నుంచే కోత మొదలెట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో 9,685 పింఛన్లు ఉండగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం రాగానే 74 పింఛన్లకు కోత విధించింది. ఇక మండలంలో పింఛన్ల పంపిణీ రెండో రోజు కొనసాగింది. మొదటి రోజున 9,611 పింఛన్లకు గాను 8,618 పింఛన్లు పంపిణీ చేశారు. రెండో రోజు మంగళవారం మిగతా పింఛన్లు పంపిణీ చేసేందుకు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు చర్యలు చేపట్టారు. స్థానికంగా అందుబాటులో లేకుండా అనారోగ్యంతో వేర్వేరు ప్రాంతాలలో చికిత్స పొందుతున్న వారిని గుర్తించి వారికి పింఛను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఒకరికి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో లబ్ధిదారుకి మంగళవారం మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పింఛను నగదు అందజేశారు.

బురదమయంగా ఇందిరమ్మ కాలనీ రోడ్డు


అధ్వానంగా ఉన్న ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి

మునగపాక : మునగపాకలోని ఇందిరమ్మ కాలనీలో ప్రధాన రహదారి బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారి మట్టిరోడ్డు కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవ్వడంతో కిందపడిపోతున్నామంటూ పలువురు వాపోతున్నారు. కాలనీ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ప్రధాన రహదారి పక్కారోడ్డుగా నిర్మించకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం


జింక్ మాత్రలు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. డయేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునగపాకలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వర్షాకాలంలో రోగాలు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వనీటితో దోమల వ్యాప్తి


దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం : ఇళ్లల్లో పెరిగే దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గుర్రాజుపేట సర్పంచ్ రత్నం అన్నారు. పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో గుర్రాజుపేట గ్రామంలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. సీజనల్ వ్యాధులు సోకే సమయం వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఇళ్లలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్లలో నిల్వ నీటిని తొలగించేందుకు తనిఖీలు నిర్వహించారు. మురుగు కాల్వలు శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి శ్రీనివాస్, పర్యవేక్షకులు ఎస్.దేవరాజ్, ఎన్.సత్తిబాబు మాట్లాడుతూ దోమకాటు వల్ల ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు.

కలుషిత నీరు, ఆహారంతో డయేరియా వ్యాప్తి


కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కోటవురట్ల : అతిసార పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సంతోష్‌కుమార్ సూచించారు. అతిసారంపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేసి అతిసార ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తాగు నీరు కలుషితమై డయేరియా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. తినే ఆహారం పట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై విక్రయించే తినుబండారాల జోలికి పోవద్దని, వ్యక్తిగత, చేతుల పరిశుభ్రత తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు


ఆపరేషన్లు చేయించుకున్న వారితో రాజేష్, అనిల్

అనకాపల్లి : స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు రోటరీ అధ్యక్షుడు సారిపల్లి రాజేష్ తెలిపారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో 41 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా 8 మందిని ఎంపిక చేసి, అన్ని పరీక్షల తర్వాత ఐవోఎల్ కంటి వైద్యులు కె.మల్లేశ్వరరావు ఈ ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ అనంతరం 5 రోజులకు సరిపడ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోగులు, నేత్ర వైద్య సహాయకురాలు పి.దేవి పాల్గొన్నారు.

5న వృద్ధుల సమావేశం

అనకాపల్లి : జిల్లా గ్రామీణ వయో వృద్ధుల ప్రజా సంక్షేమ సంఘ సమావేశం ఈ నెల 5న స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి జిల్లాలోని వృద్ధులు హాజరు కావాలని ఆయన కోరారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.